# పూలూ-పడగలూ

కూచి సాయిశంకర్



**"రేపు వచ్చే పదహారున సుబ్రహ్మణ్య షష్ఠి. మహత్తరమైన రోజు. ఆ రోజు సుబ్రహ్మణ్యస్వామికి 'పూలూ-పడగలూ' ఇప్పించు అమ్మాయి చేత!**

"ఆ నాగదోషా లూ అవీ సమూలంగా పోయి పండంటి .... ఏవిటి ... పనసపండంటి పిల్లాడు పుట్టి పనసతొనల్లాంటి నవ్వుల్ని కురిపిస్తూ మీ నట్టిల్లుని తీపి చేస్తాడు! శుభం!" దత్త పంతులుగారి అభయం. ఆయన నోటి వాకక్కు నరసమ్మ మనసుకి నిండు వేసవిలో అమృతస్నానమే మరి.

ఈ వైనం పట్టనట్లు ... పెరటిలో ఆ మూల బాదం చెట్టుక్రింద వేసిన నులక మంచంమీది తెల్లదుప్పటిమీద నల్లరేగుపండులా పడుకుని, ఆలోచిస్తోంది, తీవ్రంగా ఆలోచిస్తోంది ... నర్సమ్మ ఏకైక కూతురు తులసి! అలనాటి ఆణిముత్యాల 'పూలూ - పడగల' జ్ఞాపకాల్ని కొసరి కొసరి తలుచుకుంటోంది.

* * *

"ఆఁ, అన్నీ ఉన్నాయిలే! కొబ్బరికురిడీలూ, బియ్యం, కొమ్మరికాయలూ, పానకం, వడపప్పు, బంతిపూలదండా, విడిపువ్వులూ, పసుపుగుడ్డా, జాకీటుముక్కా - అన్నీ ఉన్నాయుయ్యా! మొన్నసారి వానపల్లి తీర్థంలో కొన్న కొత్త ఇత్తడిబిందెలో అన్నీ సిద్ధం. పసుపుకొమ్ములైతే నల్లరంగడు తెస్తానన్నాడు సూర్రావు కొట్టుకాడ్నించి ఇంకా కొనాల్సినవీ ...!" అమ్మ దీర్ఘానికి ఆదిలో అడ్డుగోడగా 'పూలూ-పడగలూ' ... చుట్టపొగలోంచి మాటొదిలాడు తండ్రి 'ఎంకన్న' కిసుక్కుమన్న కూతురివైపు కళ్లెగరేస్తూ! అదిగో ... అదిగో అప్పుడు వింది తులసి పూలూ -పడగల వైనం. ఐనా ఏవిటవీ, ఏటుంటాది దాంట్లో ... 'సూడాలి సిత్రం ఎంటనే' అనేసుకుంది.

తగ్గట్టుగానే అమ్మనాన్నలతో, పెద్దపోలెమ్మతో, వక్కింటి వరాలమ్మతో, ఆళ్ల సిన్నబ్బితో, ఆలస్సంగా వచ్చిన నల్లరంగడితో.. 'అమలాపరానికి' బయల్దేరింది. సుబ్బారాయుడి గుడికాడ 'పూలు-వడగల' సత్రం 'తనివితీరాసూడాల'నుకుంది తులసి... బండి బయల్దేరింది.

వంటికిందకి "సెరుకుముక్క' తోడు దొరికింది ఆమెకి. పచ్చని చేలల్లో ప్రభలై తలూపుతున్న కొబ్బరిచెట్ల అందాలనీ వాటిపైవాలి అల్లరిపెట్టే పక్షుల కేరింతల్నీ..చెరువు బాతుల చేష్టలనీ, కళ్లారా జుర్రుకుంటూ మధ్యమధ్య సెరుకురసం... దావతగొంటూ... అమలాపరం పట్నం(!) జనాల అలికిడి తల్చుకుంటూ మురిసి పోతోంది తులసి. ఇక తను ఎక్కిన బండి నల్లరంగడి 'తోలుడు'లో బృందావన సారంగే..

"ఏం ఈర్రాజుమావా! అపుడే తీర్థంచుట్టి ఎనక్కొత్తన్నవే.. గిలక్కాయ మనవడికేనా లేక ముసిల్దాన్తో సరసాలాటకా కొనుక్కుంట... ఆఁ.." అంటూ ఎదురొస్తున్న బండిలోని వీర్రాజుని ఆటవట్టిస్తున్న తండ్రి మాటల్ని తనూ చెరుకురసంలో కలిపి మరీ గొణిగింది తులసి. తల్లినరసమ్మ సున్నితమైన 'శొంఠిపిక్కకి' నెమ్మదించింది.

హాయైన తీరులో బండి 'అమలాపరం' చేరింది.

'ఆఁ.. ఆఁ... ఈ పాలిజనం ఏభైల్నాటి వరదే... ఒరే! రంగా ... బండిని ఎంకటేశ్వరా సినీమాలుకాడ

ఎట్టు... ఎద్దుల్నిప్పి కూసిన్ని నీళ్లెట్టి... ఒళ్లురాసి ఎనకమాల రా... ఈ లోపు మేం నడుస్తాం.. దిగండల్లాబండి... ' ఎంకన్న మాటతో అంతా దిగారు. బండి వెనక్కు మళ్లించాడు రంగడు.

జనం సముద్రంలా ఉప్పొంగుతున్నారు భక్తిభావంతో.

"ఒలేయ్! పిల్లగోళ్ల జార్త, తప్పిపోగల్రు, అమ్మతులసీ నవిలినంత పెరుకు సాలు... ఆ పిప్పిని ఊసేసి... నా ఎంటనడు .. అసలే తింగిరివి' ' అంటూ హుకుం జారీ చేసి ముందు నడిచాడు షష్ఠిరథంలా 'ఎంకన్న' వెనుకమందితో.

ఎవరి ధోరణిలో వారు జనం మధ్యపడి నడక మొదలెట్టారు గుడికేసి.

తులసి తదేకంగా చూస్తోంది చక్కగా చక్రాల్లాంటి కళ్లను నలువైపులా తిప్పుతూ. 'ఆహా...ఏం పండగా, ఏం తీర్థం, ఏం జాతరా, ఏం తిరునాళ్లా, అమ్మయ్యో! ఏవమలాపరం ఇదీ!! ఈరేంటల్లా.. జనం పోలేరమ్మ మొగజాతరకంటే ఎక్కువున్నారే!!' ఆమెలో ఆలోచనలు ఆమె మొహంమీదపడి ఊయలలాగుతున్న ముంగురుల్లా మూగాయి.

కొండలమధ్య ఒరిసిపారే పూలనదిలా.. ఆ పూలనదిలోని పూలపడవలా... తులసి ఆ జనసముద్రం మధ్య చిత్రాలు పోతోంది.

"ఓసోస్! ఎన్నికొట్లు... ఎన్నిదుకాణాలూ... ఏవిటిదీ... ముందుగా 'అట్లపుల్లలూ' అమ్మే ఇనపకొట్లూ... ఆ పక్క తూతూ బూరాలూ, చెమ్కీ బిళ్లలూ అమ్మే 'పిలాస్టి సామాన్ల కొట్లూ'... మధ్యమధ్య పాయసంలో బెల్లంముక్కల్లా 'మంచం మిఠాయి' దుకాణాలా...అమ్మో... అమ్మో... జీళ్ల కొట్లు, ఖర్జూరప్పళ్ల కొట్లూ బాగా వేశారే... అదేందదీ... సద్దికంచవంత ఉందా జీడి... అంతబెల్లం జీడే!! ఎంతబరువు తూగుతుందో.. బియ్యంవట్టుకిస్తాడా మా వల్లెలోలా...'' అనుకుంటూ... ఆశ్చర్యపోతూ నడుస్తోంది తులసి. అంతలో ఎక్కణ్నుంచో ఓ రంగుల బుడగ మీదొచ్చి పడింది... ముందు ఉలిక్కిపడ్డా... ఆనక దాని వెనక పరిగెత్తుకొచ్చిన పాప చేత పెట్టి... ఆ పిల్ల బుగ్గగిల్లి ముద్దెట్టుకుంది. నడకసాగించింది... ఇంకా రంగులరాట్నం... పావులోళ్లు... వాళ్ల నాగస్వరం, కాశీవట్నం పిల్లాడూ, కాశీ కావిళ్లబైరాగులూ... అబ్బబ్బ.. ఒకటే హడావిడి, సందడి.

సరిగ్గా అపుడు మేల్కొంది తులసిలోని ఆలోచన... ఉత్సుకత..." ఔనూ! గుడి దగ్గర పడుతోంది... ఇంతకీ 'అవి' ఏవీ!! అమ్మా, నాన్న వాటి ఊసెత్తరే''... అనే ధ్యాసలో ఉండగా తనచేతిని గట్టిగా పట్టుకుని ఆపి ఏదో అడుగుతున్నారు. అడుగు పడక ఆగింది... ఆ వెనుకే ఎంకన్నా, మందీ ఆగారు. "ఏమ్మా! పూలూ-పడగలు... పూలూ- పడగలు ఒక్క రూపాయికే...కొనండమ్మా... మీదే బోణీ!' అంటోంది నల్ల ఉమ్మెత్త పువ్వులాంటి లంగా-జాకెట్టు పిల్ల, ఆమె చేతిలోని ఇత్తడిపళ్లెంలోని 'పూలూ-పడగలు' చూపిస్తూ. 'అంటే! ఇవన్నమాట పూలూ-పడగలూ' అనుకుంది తులసి కళ్లు పెద్దవిచేసి చూస్తూ.

తండ్రి వంకచూసింది తులసి కొనమన్నట్లు. కూతురి మనసు కొసరంటా చదివినట్టుగా అప్పటికే ఓ రెండురూపాయలు తీసి పాప చేత పెట్టాడు ఎంకన్న. పాపచేతిలోని పూలూ- పడగలు తనే అందుకుంది తులసి. అమాంతం కళ్లకి అద్దుకుంది వాటిని.

నడకమళ్లీ మొదలైంది గుడికేసి. ఈసారి తులసి మరింత పరీక్షగా చూసింది పూలూ-పడగల్ని. అచ్చంగా అరచేయిపట్టేంత చిన్నసైజు కోటిపల్లిపడవల తెరచాపల్లా ఉన్నాయి, తెల్లగా, దారంచుట్టి. పైగా... రెండు రెండు.. రెండు అగరొత్తులు కూడా జతచేసి ఉన్నాయి. అన్నీ బావున్నాయి కానీ ఆ పొట్లాలలో ఏవుంటాయో విప్పి చూస్తే... ' అనుకుందో లేదో 'ష్'మనే సంజ్ఞ ... మోచేయి పొడుపూ... వద్దని వారించాయి తులసిని... పైగా చెంపలేసుకోమనే చూపు ఒకటీ ... నర్సమ్మనించి..

ఇలాంటి సమయానికి గుడికి చేరువయ్యారంతా... గంటలూ, సన్నాయి మేళం, పూజార్ల మంత్రఘోషా వాతావరణాన్ని భక్తిపూతం చేస్తున్నాయి.

క్యూలో చేరి.. వల్లీదేవసేనానమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్ని నేత్రపర్వంగా దర్శించుకున్నారు ఎంకన్న బృందం. తులసి ఆనందం అంబరమంటింది. ఏదో తృప్తి ఆమెలో నెమలిఫింఛమై విప్పుకుంది.


అమ్మ చేతిమీదుగా పూలూ-పడగలూ ... ఇతరాలూ స్వామికి సమర్పించబడ్డాయి. ఆ తృప్తీ, సామి దీవెనా తులసి నొసట బొట్టుగా నిలిచాయి.

* * *

కానీ ... నేడా బొట్టు గతి ఏమౌతుందోననే పీడకల తులసి మనసులో కలకలం రేపి, ఆమెలోని ఆవేదన కట్టలు తెగిన కన్నీటి నదిలా, ఆమె పయ్యెద మీంచి పావన గోదార్లా దూకుతోంది. వరవళ్లు తొక్కుతోంది. పూలూ-పడగల జ్ఞాపకాల్లోంచి ఇవతలకొచ్చి వలవలా ఏడుస్తున్న ఆమెకి ఊరట కలగజేయడానికి ఆమె కన్నీటి వెనుకున్న కారణం కనుక్కోడానికీ ఎంకన్న శతథా ప్రయత్నం చేస్తున్నాడు.

ఏదో చెప్పాలని ఉన్నా చెప్పలేని నిస్సహాయత తులసి కనుపావల్లో కొట్టొచ్చినట్లుగా కనపడుతోంది అతనికి. ఆ కన్నీళ్ల వెనక కన్నతల్లిని కాలేకపోవడానికి గల కారణాల గాథ ఏదో ... తెరలు తెరలుగా పొంగిపొర్లుతోంది. మూగగా రోదిస్తున్న తులసిని అనునయాల కౌగిల్లో దాచుకుని, ఆమెని ఊరడించటానికి పదేపదే ప్రయత్నం చేస్తున్న ఎంకన్నకి .... సమయానికి తగ్గట్టు ఏదో పాత జ్ఞాపకం మొహాన మంటలా తగిలింది. 'మీ భావం నిజమే, ఆలస్యం వద్దు!' అన్నట్లుగా ఓ నిండారు స్పర్శ అతని భుజాన్ని సున్నితంగా తట్టింది - నర్సమ్మ చేతిరూపంగా.

అంతా తల పంకించి...ఒక్క ఉదుట్న లేచి ...కర్తవ్యం నెత్తిన పెట్టుకుని' కార్యం సఫలం'



చెయ్యడానికి బయలుదేరాడు ఎంకన్న. వెళ్తున్న అతని ఆలోచనలో... పంతులు గారు జ్ఞాపకం చేసిన 'పూలూ-పడగలూ' క్షణక్షణం జ్ఞాపకానికొస్తూనే ఉన్నాయి.

* * *

"ఏవిటేవిఠీ! ఇన్ని సంబారాలే! అబ్బో, అబ్బో! జంతిక చుట్టలూ, పందార చిలకా! బెల్లంలడ్డూ మిఠాయీ, పసుపూ, కుంకం, కుంకుడుకాయలూ, సున్నిపిండీ, చారెడు గానుగనూనే, అరటిపండూ ... చూస్తే కంచం సాలదల్లే ఉంది. పోనీ అర్ధంకారిలంక నుంచి ఆరడగుల అరిటాకు తెప్పించనా నర్సమ్మా!" అంటూ బుగ్గల్ని మరి లేవకుండా లోపలికంతా నొక్కుకుంటూ గంపెడాశ్చర్యపోయింది గానుగ పెద్దాలమ్మ. నర్సమ్మలో కించిత్ గర్వం పొడచూసింది. ఆ వెనుకే ఓ పీడకల జ్ఞాపకం కొంచెం లీలామాత్రమైంది ఆమె కళ్లముందు.

"నీతో కాపరం ఏవిటే కుక్క ... కూతురా! ఇప్పటికే ఏడాది దాటుతోంది మీ వోళ్లు ఇస్తావన్న 'వాచీ - ఉంగరం' ఇవ్వక ... ఆహాహా! ఏం పెద్దమనుషులే మీ అమ్మ, బాబూ! ఇగో, ఇదే సివరి మాట! అయి ఇత్తే పక్కమీద పూలూ, నీ వంటిమీద సీరా నలుగుతాయి. లేపోతే పెద్దాపురవో, తాటిపాకో .... నా దారి నాదే! నీ సావు నీదే!!" తులసి భర్త దాష్టీకం ఇది.

"వెర్రి అమ్మ నాయమ్మ తులసమ్మ ఏడాదిగా ఎంత 'పాటు'పడిందీ! కడుపులో 'గుట్టు' దాచుకుని ... నయం, ఇప్పటికేనా కలతల కల కరిగింది. అంతా సుబ్రమణ్యస్వామి దయ!" అనేలా నిట్టూర్పు వదలి మరోసారి గానుగ పెద్దాలమ్మ మాట తల్చుకుని మురిసిపోతూ ఇంటిదారి పట్టింది నర్సమ్మ.

ఆమె ఇల్లు చేరే సమయానికి ఎదురై ... 'చూశావా! నరసమ్మా! నే చెప్పినట్లు నాగదోషం పోవడానికి పూలూ -పడగలూ అమ్మాయిచేత ఇప్పించావు. ఇప్పుడు చూడు గుమ్మడిపండులాంటి పిల్ల నెత్తుకున్న తులసమ్మ కళ చంద్రకళే!" అంటూ ఆనపకాయల దండనీ, స్వయంపాకాన్నీ మోయలేక మోసుకుంటూ దీవెనలనందిస్తూ ఇంటి దారిపట్టారు పంతులుగారు.

"ఇన్నావా! 'పూలూ-పడగల' మహత్యంట!" లంకపుగాకు చుట్టపొగలో రంగరించిన ఎంకన్న వ్యంగ్యభావానికి దీటే అన్నట్లుగా 'నిజమే గందా!' అని వంత పాడాయి నరసమ్మ చేతికున్న సీమ గాజులు.

Ⓟ


సౌదామిని
పద్మ
నీహారిక
సుందరి
ప్రియ

- అయిదుగురు
మహిళల
జీవన
గమనంలో
ఎదురైన
విచిత్రానుభవాల
కథనం

చంద్రశేఖర్ మల్లాది
సీరియల్
'మంచుతెరలు'

వచ్చేవారమే ప్రారంభం!
1995 దీపావళి నవలల పోటీలో ఎంపికైన
సాధారణ ప్రచురణ నవల!